క్లుప్తంగా

ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోవాలి

చీమకుర్తి: పదో తరగతిలో 500 మార్కులకు పైగా, ఇంటర్‌లో 800 మార్కులకుపైగా సాధించిన విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు సంఘ చీమకుర్తి ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు స్థానిక సంఘం ద్వారా దరఖాస్తులు అందించాలని సూచించారు.

49వ డివిజన్ వలంటీర్లు రాజీనామా



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో రాజీనామా చేస్తున్న వలంటీర్లు

ఒంగోలు: స్థానిక 49వ డివిజన్‌లో పలువురు వలంటీర్లు మంగళవారం సామూహికంగా రాజీనామా చేశారు. టీడీపీ నాయకులు వలంటీర్లపై అనుచితంగా మాట్లాడుతున్నారని, అందుకు నిరసనగా రాజీనామా చేశామని వారు తెలిపారు. తాము జీతం కోసం పనిచేయలేదని, తమ సేవలకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందనే ఉద్దేశంతో పనిచేశామని చెప్పారు. కానీ, చంద్రబాబు వ్యాఖ్యలు తమకు బాధ కలిగించాయన్నారు. ఈ నేపథ్యంలో రాజీనామా చేశామన్నారు. రాజీనామా అనంతరం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి మద్దతు తెలిపారు.

ముగ్గురు వలంటీర్ల రాజీనామా

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు గ్రామంలో ముగ్గురు వలంటీర్లు దాసరి శీను, ఎస్.మస్తాన్, వినోద్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి దారా వెంకట్రావుకు అందజేశారు. ఇటీవల నలుగురు వలంటీర్లు రాజీనామా చేసిన విషయం విధితమే.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

మద్దిపాడు: .మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆరోగ్యశాఖ సిబ్బంది తెలిపారు. హాజరైన రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులిస్తున్నట్లు తెలిపారు. వెల్లంపల్లి గ్రామంలో 325 మంది రోగులు పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు ఆనందమోహన్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ శిరీష, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై పోరాడాలి

ఒంగోలు: సామాజిక సమస్యలపై విద్యార్థులు పోరాడాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక యూనివర్సిటీలోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లను విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, నిరక్షరాస్యత నిర్మూలన, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, రక్తదాన శిబిరాల ఏర్పాటు వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు మరింతగా దగ్గర కావాలన్నారు. యూనివర్శిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్, ఏకేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్, ఏకేయూ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ భారతీదేవి పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటు చేస్తాం

- ఐదేళ్లలో పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన
- ప్రతిఒక్క కుటుంబానికి సంక్షేమ లబ్ధి
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- వైఎస్సార్ సీపీలోకి 30 మెకానిక్‌ల కుటుంబాలు



మెకానిక్‌లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని రిక్షా బజారులో ఉన్న మెకానిక్ వీధిలోని 30 మంది మెకానిక్‌లు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ట్రాక్టర్స్ మెకానిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన ట్రాక్టర్ మెకానిక్లు, ఫ్రాండీ వర్కర్లకు బాలినేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మెకానిక్‌ల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఇక్కడ సుమారు 300 మంది మెకానిక్‌లు పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నారని, వారికి అండగా నిలుస్తానన్నారు. గత ప్రభుత్వంలో మీ కుటుంబాలకు జరిగిన మేలు ఎంత, జగనన్న ప్రభుత్వంలో మీ కుటుంబాలకు జరిగిన మేలు ఎంతో పోల్చుకొని చూసుకోవాలని, పేదల సంక్షేమం కోసం ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. నగరంలో ఇళ్లు లేని 25 వేల మంది నిరుపేదలకు రూ.231 కోట్లతో ఇంటి స్థలాలు పంపిణీ చేశామని, ఎన్నికల తరువాత 9 నెలల్లో ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇప్పటికీ ఎవరికైనా ఇంటి స్థలం మంజూరుకాకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసినట్లు తెలిపారు. అమ్మఒడి, చేయూత, భరోసా పథకాలతో పాటుగా అవ్వాతాతలకు ప్రతి నెలా పింఛన్లు ఇంటివద్దకే తెచ్చి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, మన్సూన్ ఖాన్, మొగల్ సాలెహా, పఠాన్ జబీవుల్లా ఖాన్, రహీం, అజయ్, శ్రీను, మీరావలి, బాజి, షేక్ సుభాని, సాదిక్, షఫి, సూరిబాబు, వెంకటరావు, రాము, వెంకట సాయికుమార్, మస్తాన్ , రాము, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

● చిట్ చాట్..!



బాబూ చాట్ ఏముంది.. మిరపకాయ బజ్జీ చాట్ ఇస్తావా..? మా మిత్రులందరికీ కూడా ఇవ్వు... అంటూ ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సరదాగా గడిపారు. మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తూ స్థానిక లాయర్ పేటలోని చాట్ బండి వద్ద ఆగారు. అక్కడున్న వాళ్లతో కలిసి చాట్ తింటూ ముచ్చట్లు చెబుతూ సేద తీరారు.

– సాక్షి, ఒంగోలు

ఐదేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

- బాలినేని, చెవిరెడ్డిని గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేయండి
- వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి, శ్రీకావ్య దంపతులు పిలుపు
- గుండాయపాలెం, పాతపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



ప్రజలతో మాట్లాడుతున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య

ఒంగోలు రూరల్: గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు పిలుపునిచ్చారు. ఒంగోలు మండలంలోని మత్స్యకార గ్రామాలైన గుండాయపాలెం, పాతపాడులో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చుంచు రామకృష్ణ, నాయకులు పేతురు, బాబులు, సాంబశివరావు, తదితరులు తొలుత ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఐదేళ్లపాటు కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఆక్వా కల్చర్ సాగుచేస్తున్న గుండాయపాలెం, పాతపాడు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా చేసేందుకు కోటీ అరవై లక్షల రూపాయలతో తీరప్రాంతంలో విద్యుద్దీకరణ పనులను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పూర్తి చేయించారన్నారు. గతంలో చిరుగాలికి, భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడేదని తెలిపారు. రోజుల తరబడి విద్యుత్ వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. దాంతో పాటు గ్రామంలోని ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారన్నారు. ప్రతి ఏటా గుండ్లకమ్మ నది నుంచి నీటిని తరలించి గ్రామాల్లో చెరువులు నింపుతున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా గుండాయపాలెం వాసులు, పాతపాడు వాసులు కోరుతున్న లింక్ రోడ్డును పూర్తి చేశామన్నారు. గ్రామంలో మండలస్థాయి పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో గత రెండేళ్లుగా 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. నాడు–నేడు పథకంలో రీమోడలింగ్ చేసిన ఈ పాఠశాల జిల్లాలోని ఉత్తమ పాఠశాలగా ఎంపికవడం సంతోషకరమన్నారు. దశాబ్దాలుగా మౌలిక వసతులు లేక వలసలు వెళ్తున్న నక్కావారిపాలెం గ్రామానికి రెండు కిలోమీటర్ల రోడ్డును, విద్యుద్దీకరణను, చెరువు రీ–మోడలింగ్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. ఒంగోలు నుంచి గుండాయపాలెంకు ఆక్వా కల్చర్ వలన తరచూ శిథిలావస్థకు చేరుతున్న రోడ్డును తిరిగి నిర్మించామని, పాతపాడు గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తయిందని ప్రణీత్‌రెడ్డి తెలిపారు. మత్స్యకారులకు సబ్సిడీపై బోట్లు, వలలను మత్స్యశాఖ ద్వారా క్రమం తప్పకుండా ప్రభుత్వం అందిస్తుందన్నారు. శ్రీకావ్య మహిళలతో ఇష్టాగోష్ఠి నిర్వహించి అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అయ్యల వాణి, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు. పాతపాడు గ్రామ ముఖ ద్వారం వద్ద గ్రామ దేవతకు పూజలు చేశారు.

వాసన్న ద్వారానే ఒంగోలు అభివృద్ధి



ఒంగోలు 20వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని సతీమణి శచీదేవి

ఒంగోలు సిటీ: ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ద్వారానే సాధ్యమవుతుందని ఆయన సతీమణి బాలినేని శచీదేవి తెలిపారు. నగరంలోని 20వ డివిజన్‌లో మంగళవారం సాయంత్రం మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డివిజన్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి 20వ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.6 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లోని ప్రజలకు సంక్షేమ పథకాల కింద రూ.13.06 కోట్లు అందినట్లు వెల్లడించారు. డివిజన్‌లోని 244 మందికి ఇళ్ల స్థలాలు మంజూరవగా, పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీరందరికీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. ఇప్పుడు కొత్తగా 180 ఇళ్ల పట్టాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకున్నారని, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల పట్టాలు అందించి ఇళ్లు కూడా కట్టిస్తామని తెలిపారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించి జగనన్నను సీఎం చేసుకోవాలని శచీదేవి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు ఎం.సురేష్, డివిజన్ ఇన్‌చార్జ్ డి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, నాగేశ్వరరావు, నాయకులు మేదరమెట్ల శంకరరెడ్డి, పిచ్చిరెడ్డి, బ్రహ్మరెడ్డి, చిట్టాబత్తిన కవిత, మేకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటేస్తేనే సంక్షేమ పాలన



కె.పల్లెపాలెంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఆనందరావు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

కొత్తపట్నం: సంక్షేమ పాలన మీ ఇంటికే రావాలంటే ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు స్పష్టం చేశారు. మంగళవారం కె.పల్లెపాలెం, రంగాయపాలెం, మోటుమాల, గమళ్లపాలెం గ్రామాలతో పాటు అన్ని పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ మండలంలోని మత్స్యకార గ్రామాలకు, మత్స్యకారులకు టీడీపీ ప్రభుత్వంలో కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని, అందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ మత్స్యకార భరోసాను రూ.4 వేల నుంచి రూ.10 వేలకు జగనన్న పెంచారని తెలిపారు. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా, ఆయిల్ సబ్సిడీ పెంపు చేశారన్నారు. వేట నిషేధ సమయంలో మండలంలో గత నాలుగేళ్లలో 4,086 మందికి రూ.11.21 కోట్ల వైఎస్సార్ మత్స్యకార భరోసాను బ్యాంక్ అకౌంట్లలో జమచేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ రైతు భరోసా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మొదలగు 34 సంక్షేమ పథకాలు అమలు చేసి అకౌంట్లలో నగదు జమ చేశారని వివరించారు. పథకాలన్నీ మళ్లీ కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో సైకం రాంబాబు, మూలయ్య, తిరుపాలు, బ్రహ్మయ్య, ఏడుకొండలు, నాంచార్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి



గరుడ వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏడో రోజు చివరి రోజు కావడంతో ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉదయం ఎనిమిది గంటలకు నిత్య హోమాలు, కుంభారాధన, అశ్వ వాహనం, చలువచొప్పారం , ఎదురుకోలు, పది గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు అంగరంగ వైభవంగా స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు.

వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక



దుంపా చెంచిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న పేర్నమిట్ట టీడీపీ నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో టీడీపీ నేతలైన నూకతోటి శేషయ్య, దాసరి సుబ్బారావు, నాగార్జున, ఎస్.శ్రీనివాసరావు తదితర కుటుంబాలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, 40వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, 42వ డివిజన్ ఇన్‌చార్జ్ నూకతోటి ఈశ్వరరావు, రావూరి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ కత్తినేని శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బాలినేని విజయాన్ని ఆకాంక్షిస్తూ పూజలు



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శాండిల్య, తదితరులు

ఒంగోలు మెట్రో: వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ చైత్ర పౌర్ణమి మంగళవారం ప్రాతఃకాలమున స్థానిక ట్రంక్ రోడ్ విక్కీ టైలర్స్ వీధిలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఉప్పుగుండూరు శ్రీనివాసరావు, 36వ వార్డు కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, చిన్నబాబు, కాలభైరవ ఉపాసకులు మైనంపాటి సాయికుమార్ పాల్గొన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించాలని పరమేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతీదేవికి అష్టోత్తర కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు పాల్గొన్నారు.


పది ఫలితాల్లో పలు పాఠశాలల సత్తా



ఉత్తమ మార్కులు సాధించిన శ్రీనిర్మల కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు



శ్రీచైతన్య విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం అంజయ్య



నారాయణ విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం పెద్దిరెడ్డి

ఒంగోలు: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఉత్తమ మార్కులు సాధించి అభినందనలు అందుకున్నారు.

నిర్మల స్కూల్ విద్యార్థులు,,,

స్థానిక నిర్మల స్కూల్ విద్యార్థులు షేక్ దిల్షర్ భాను 594, ఆళ్ల మనోజ్ఞ 593 మార్కులు సాధించినట్లు గౌరవ సలహాదారు నల్లూరి నిర్మల హరిబాబు, డైరెక్టర్ నల్లూరి సురేంద్ర తెలిపారు. 590కిపైగా ముగ్గురు, 580కిపైగా 16 మంది, 570కిపైగా 30 మంది, 560కిపైగా 44 మంది, 550కిపైగా 50 మంది, 500కుపైగా 104 మంది సాధించినట్లు వివరించారు.

గౌతం మోడల్ స్కూల్ విద్యార్థులు...

గౌతం మోడల్ స్కూల్ విద్యార్థులు కె.శరణ్యారెడ్డి 594, ఎస్‌వీఎస్ పరిజ్ఞ 590 మార్కులు సాధించారని కరస్పాండెంట్ ఎం.కొండయ్య తెలిపారు. 590కిపైగా ఇద్దరు, 550కిపైగా 28 మంది, 500కిపైగా 58 మంది సాధించారన్నారు. డిస్టింక్షన్ సాధించడంతో పాటు క్లాసు యావరేజ్ 530 మార్కులతో తమ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న గౌతం మోడల్ స్కూల్ కరస్పాండెంట్ కొండయ్య

నారాయణ స్కూల్ విద్యార్థులు...

నారాయణ విద్యార్థులు గణితంలో 26 మంది, తెలుగులో 18 మంది, సైన్స్‌లో నలుగురు, సోషల్‌లో ఐదుగురు వందకు వంద మార్కులు కైవసం చేసుకున్నారని నారాయణ సీఓ అండ్ ఒలంపియాడ్ ప్రిన్సిపాల్ సయ్యద్‌నాగూర్ వలి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి 592 మార్కులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. సరాసరి 548 మార్కులను తమ విద్యార్థులు సాధించారన్నారు. 590కిపైగా నలుగురు, 580కిపైగా 15 మంది, 550కిపైగా 60 మంది, 500కుపైగా 90 మంది సాధించినట్లు తెలిపారు.

శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు...

శ్రీచైతన్య విద్యార్థులు మాదుగుల లాస్య 594 మార్కులు సాధించినట్లు ఏజీఎం అంజయ్య తెలిపారు. 590కిపైగా నలుగురు సాధించడంతో పాటు 100శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మంగళవారం స్థానిక సాయి ఐటీఏ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో అంజయ్యతో పాటు రీజినల్ ఇన్‌చార్జి అనీల్, జోనల్ కో ఆర్డినేటర్లు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఘనంగా శ్రీచైతన్య వార్షికోత్సవం...

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్ శ్రీచైతన్య బ్రాంచ్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు తరగతుల్లో, ప్రతిభా పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసపత్రాలు అందజేశారు. ఏజీఎం అనిల్, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో వైభవంగా కుంభాభిషేకం

- పాల్గొన్న విశాఖ పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి



పూజల్లో పాల్గొన్న స్వాత్మానందేంద్రస్వామి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: చీమకుర్తి హరిహరక్షేత్రంలో 18వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పూర్ణాహుతి మహాకుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. స్వామి వారికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆలయంలోని హరిహరసుత అయ్యప్పస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్నాంజనేయస్వామి, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి, శ్రీపార్వతీ సమేత శ్రీనగరేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. నిత్యహోమాలు, మూలమంత్ర హోమం, కళాన్యాస హోమాలు జరిపించారు. భక్తులనుద్దేశించి స్వాత్మానందేంద్రస్వామి అనుగ్రహ సంభాషణ చేశారు. అగ్నిహోమం, కలశ పూజ, ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ సభ్యులు, శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులు, అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, చలువాది బదరీనారాయణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోండి

- డీఎంహెచ్‌ఓ డా.రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: మలేరియా లాంటి ప్రమాదకర జ్వరాలకు కారణమయ్యే దోమలు వ్యాపించకుండా ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకవాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా వ్యాధి నిర్మూలనపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. వేసవిలో కంటే వర్షాకాలంలో మలేరియా ఎక్కువగా సోకే అవకాశాలు ఉంటాయని, వచ్చే వర్షాకాలంలోపు గ్రామీణ ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అన్నీ వైద్యశాలలో రక్త పరీక్ష సౌకర్యాన్ని కల్పించిందని, అలాగే మలేరియా ఔషధాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా మలేరియా జ్వరం వచ్చినట్లు అనుమానం కలిగితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలను చేయించుకోవాలని, సకాలంలో సరైనా చికిత్స చేయించుకోవడం ద్వారా మలేరియా బారినుంచి సురక్షితంగా బయట పడవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.మాధవిలత, డీపీఎంఓ డా.వాణిశ్రీ, మెడికల్ ఆఫీసర్ డా. శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.